క్లుప్తంగా

నేడు సెయింట్ ఆన్స్ కళాశాలలో ఉద్యోగాల ఎంపిక

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో హెటిరో డ్రగ్స్ కంపెనీ వారిచే క్యాంపస్ సెలక్షన్స్ బుధవారం ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈఏడాది ఉత్తీర్ణత కాబోయే బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీటెక్ (మెకానికల్) క్యాంపస్ సెలక్షన్స్‌కి అర్హులని తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపస్ ఇంటర్వ్యూలకు విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

విధుల్లో అంగన్‌వాడీలు

బల్లికురవ: ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలతో జరిపిన చర్చలు సఫలం కావటంతో మంగళవారం కార్యకర్తలు సహాయకులు విధుల్లో చేరినట్లు సంతమగులూరు ఐసీడీఎస్ సీడీపీవో దాసరి సుధ తెలిపారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 134 మంది కార్యకర్తలు, 129 మంది సహాయకులు, సమ్మెను విరమించుకుని జాయింగ్ రిపోర్టులతో విధుల్లో చేరారని చెప్పారు. గత 45 రోజులుగా సచివాలయ ఉద్యోగులచే బాలింతలు, చిన్నారులకు బాలామృతాన్ని అందించామని కార్యకర్తలు రికార్డులు అప్‌డేట్ చేసుకుని, ఫీడింగ్ పంపిణీతో ప్రీ స్కూల్ నిర్వహించి చిన్నారులను తీర్చిదిద్దాలని కోరారు.

బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండ మంజులూరు గ్రామానికి చెందిన చొప్పరపు మోజేష్ (33) సోమవారం పంగులూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పానెం శ్రీనివాసరెడ్డి, పానెం శ్రీనివాసరెడ్డి మోజేష్ మృదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు జంపాని రవిబాబు, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, ఎంపీటీసీ రాంబాబు, నాయకులు జంపాని రాజ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

నేటి నుంచి శిల్పం, చిత్రలేఖనంలో శిక్షణ

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో వర్ణికా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జనవరి 31వ తేదీ వరకు దళితులకు శిల్పం, చిత్రలేఖనంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వర్ణికా ఫైన్ ఆర్ట్ అకాడమీ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్ కత్తి బాలకోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి కొండ వద్ద గల వర్ణికాఫైన్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు భోజనం, కలర్స్, పెయింటింగ్ కిట్‌లు అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి అయిన తదుపరి ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఆసక్తి గలవారు 79817 36648 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలతో పాటుగా ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా టీకాలను సక్రమంగా అందించాలని ఈపురుపాలెం పీహెచ్‌సీ సీహెచ్‌వో మోక్షవాణి సూచించారు. మంగళవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య స్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైకు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

మేదరమెట్ల: ఆగి ఉన్న కారును వెనుక వైపు నుంచి వచ్చిన మోటారు బైకు ఢీకొన్న ఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పైలాన్ బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలం బోడవాడ గ్రామానికి చెందిన రాయి వెంకటేశ్వర్లు మోటారు బైకుపై ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్నాడు. బైకు మేదరమెట్ల జాతీయ రహదారి పైలాన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో వెంకటేశ్వర్లుకు గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నందిగుంటపాలెంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి



పేరాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సమితి ప్రతినిధులు

- ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి
- నివాళులర్పించిన నాయకులు

బ్రిటీష్ రాజ్యాన్ని ఎదిరించిన ధైర్యశాలి చంద్రబోస్

కారంచేడు/మార్టూరు: బ్రిటీష్ దొరలను ఎదిరించి తరిమి కొట్టిన ధైర్యశాలి మన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం వారు మండల కేంద్రం కారంచేడు ఎమార్సీలో ఏర్పాటు చేసిన నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కుంకలమర్రు, నందిగుంటపాలెం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. చంద్రబోస్ విజయగాథలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాసరావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు: ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మండలంలోని వలపర్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ విద్యాసంస్థ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్థ డైరెక్టర్ సయ్యద్ కరిముల్లా నేతాజీ జీవిత విశేషాలు పోరాట పటిమ గురించి విద్యార్థులకు వివరించారు.

బోస్ స్వాతంత్ర్య పోరాటం మరువలేనిది..

అద్దంకి: భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నేతాజీ సుబాష్ చంద్రబోస్ చేసిన పోరాటం మరువలేనిదని హెచ్ఎం అంజమ్మ అన్నారు. చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆమె నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ 'బోస్ నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్య ఇస్తాను' అని చెప్పిన మాటలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పేరాలలోని చిన్నరథం సెంటర్ వద్ద గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. సమితి ప్రతినిధులు మాట్లాడుతూ నేతాజీ స్వాతంత్ర్యం కోసవ చేసిన సేవలను గుర్తు చేసుకుని ఆయన స్ఫూర్తిని ప్రస్తుత యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతాజీ సేవాసమితి అధ్యక్షులు చుండూరి కృష్ణమూర్తి, కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, ప్రతినిధులు అంబటి పుష్పరాజు, మణిబాబు, నరేష్, డీవెన్, అన్నంరాజు సుబ్బారావు, సంకా చంద్రమౌళి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

అద్దంకి: నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని 14వ వార్డులోని నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళుర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుబాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, చిన్ని శ్రీమన్నారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అన్నేని వెంకట్రావు, వారణాశి రఘురామశర్మ, బీవీకే రెడ్డి, జ్యోతి చంద్రమౌళి, యూ దేవపాలన పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలకంఠపురంలో గల అనాథ వృద్ధాశ్రమంలో చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వృద్ధులకు ఆల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు. ఈసందర్భంగా ముందుగా నేతాజీ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, చీమకుర్తి మధుసూదనరావు, డీవీ సురేష్, చింతా రమేష్, కేవీ సుబ్బారావు, షేక్ దరియా సాహెబ్, జి నారాయణమూర్తి, శ్రీకృష్ణ ప్రసాద్, గుర్రం బదిరీనాథ్, బ్రహ్మానందం, బాలగంగాధరరావు, రామారావు పాల్గొన్నారు. చీరాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్అండ్ పీఆర్ హైస్కూల్ ప్రాంగణంలో అధ్యక్ష, కార్యదర్శులు నేతాజీకి నివాళులర్పించారు.



అద్దంకి: నేతాజీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న హెచ్ఎం, విద్యార్థులు



వేటపాలెం: వృద్ధులకు స్వీట్లు పంచుతున్న అసోసియేషన్ సభ్యులు



వలపర్లలో నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బార్ అసోసియేషన్ భవన నిర్మాణం పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్ భవన నిర్మాణాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణ మూర్తి మంగళవారం న్యాయవాదులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ఇతర న్యాయవాదులు భవన నిర్మాణం నిచిలిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పదేళ్ల క్రితం భవన నిర్మాణంగావించామని కొన్ని అనివార్య కారణాల వలన పనులు నిలిచిపోయాయని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అయితే భవన నిర్మాణ పనులను పూర్తి చేయించి న్యాయవాదులకు భవనాన్ని అందుబాటులో ఉంచాలని న్యాయవాదులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన పంచాయితీ రాజ్ డీఈ శేషయ్య, మున్సిపల్ డీఈ ఏసయ్యలను పిలిచించి ప్రస్తుతం స్లాబు వరకు నిర్మితమైన ఉన్న నిర్మాణ పనులను పరిశీలించారు. పదేళ్ల క్రితం ఆగిపోయిన పనులు విషయమై వాటి నాణ్యతపై అప్పటి కాంట్రాక్టర్‌తో ఫోనులో సంప్రదించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణం త్వరలో పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో న్యాయవాదులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జయసన్ బాబు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఏజీపీ వంకాయలపాటి హరికృష్ణ, న్యాయవాదులు సీహెచ్. సురేష్, కె. ఉదయ భాస్కర్, డి. పున్నయ్య, ఎన్. రామకోటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, బి. ఆరోగ్యరావు, సుబ్రహ్మణ్యం, ఏఈ కట్టా రవి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం

అద్దంకి రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల ప్రత్యేకాధికారి ఏ బాలసుబ్రమణ్యం అన్నారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో అర్హులందరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించటం వల్ల గ్రామాల వారీగా లబ్ధిదారుల్లో సంతోషం నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వం గ్రామాలకు మంజూరు చేసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తక్షణమే పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని 7 సబ్ స్టేషన్‌లు ఉన్నాయని సూరేపల్లికి కొత్త సబ్‌స్టేషన్ మంజూరు యిందన్నారు. తహశీల్దార్ కే రవిబాబు మాట్లాడుతూ మండలంలోని 56 పోలింగ్ బూత్‌లకు ఓటర్ల జాబితాలను అందజేశామని పరిశీలించుకుని అర్హులు ఉంటే ఫారం 6, 7, 8 దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఈవోఆర్డీ దాసరి సుమతీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ గృహనిర్మాణ శాఖ ఏఈలు జీ. హనుమంతరావు, షేక్ ఖాశిం, దుర్గా రమేష్, ఏవో ఎస్‌వీపి కుమారి, జెడ్పీటీసీ చింతల అంజలి, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, ఎంఈవో 2 కె. రమేష్‌బాబు, వైద్యాధికారి జీ. రవితేజ, ఏపీవో బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

సంపూర్ణ వైద్యం అందించాలన్నదే సంకల్పం



చినగంజాంలో సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు



పూనూరులో పరీక్షల అనంతరం మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

చినగంజాం: ప్రతి కుటుంబానికి ఉచితంగా సంపూర్ణ వైద్యం అందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సంకల్పం అని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి ఎస్ హనుమంతరావు అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రాజుబంగారుపాలెం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ, రక్తపరీక్షలు చేసి ఉచితంగా నెలకు సరిపడా మందులు అందజేశారు. వైద్యాధికారులు ఎస్ విజయభాస్కర్, పీ సాయి శ్రీ చరణ్, ఎస్‌కే హసీనా బేగం, డాక్టర్ లక్ష్మీనారాయణ వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విజన్ టెక్నీషియన్ కే జ్యోత్స్న కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎన్ వేణుగోపాలకృష్ణమూర్తి, సీహెచ్ఓ పీ ఝాన్సీరాణి, పీహెచ్ఎస్ ఎస్ బేబి, సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు మురళి, మహేష్, 104 సిబ్బంది పాదిలి రాఘవ, ఇన్‌చార్జ్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, సర్పంచ్ భూలక్ష్మీ, ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి స్టేట్ కో ఆర్డినేటర్ వెంకట్, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

యద్దనపూడి: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ కృష్ణకుమారి అన్నారు. మండలంలోని పూనూరులో వైద్య బృందంతో 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు శ్రీహర్ష, సిద్ధార్థ, సుకన్య, ప్రీతి, సీహెచ్ఓ ప్రసాద్, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్, సర్పంచ్ మేకా సుధాకర్, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, హెచ్‌వీలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న జీపీఐ కంపెనీ ప్రతినిధులు

యద్దనపూడి: పొగాకు రైతులు నష్టపోకుడదనే ఉద్దేశంతో జీపీఐ కంపెనీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీపీఐ కంపెనీ జనరల్ మేనేజర్ ఎమ్. ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలోని పొగాకు గూడెంలో గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బర్లీ పొగాకు కు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రైతులకు తగిన మద్దతు ధర రావాలంటే పంటలో తగిన తేమతో పాటు ఇతర అన్యపదార్థాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధి రాడ్నే మిరియోగా మాట్లాడుతూ రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించి లాభాల బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు , స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు శింగరకొండలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి నేడు బుధవారం మండలంలోని పలు కార్యక్రమాల్లో పర్యటించనున్నారని ఆపార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 11 గంటలకు మండలంలోని శింగరకొండలోని భవనాశి చెరువు నుంచి కాలువలకు నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు కొంగపాడు గ్రామంలో 'పల్లె పల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపింది. కావున కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు, మండల పార్టీ కన్వీనర్లు, సొసైటీ అధ్యక్షులు, మండల జేసీఎస్ ఇన్‌చార్జులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

నాగిరెడ్డికి గిడుగు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నాగిరెడ్డి

కారంచేడు: మండలంలోని యర్రంవారి పాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డికి గిడుగు జాతీయ పురస్కారం లభించింది. మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి మనుమరాలు కాంతి కృష్ణ ఆధ్వర్యంలో గిడుగు వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షతన పురస్కారాలు పంపిణీ చేశారు. ఉత్తమ సేవలందించిన అనేక మందికి కవులు, కళాకారులు, రచయితలకు ఈ పురస్కారాలు బహూకరించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆదాయశాఖ కమిషనర్ డాక్టర్ జీవన్‌లాల్ పవాడియా చేతుల మీదగా ఆయనకు అందుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ చంద్రయ్య, మామిడాల శైలజ, నామాని సునీత, డాక్టర్ అంజనీదేవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

చీరాల: మైనర్ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన మంగళవారం పట్టణంలోని హరిప్రసాద్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఒన్‌టౌన్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. హరిప్రసాద్‌నగర్‌కు చెందిన బాలిక ఆర్వోబీ సమీపంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టానికి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కోటపాడులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు



కడవకుదురులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వేణుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సామ్రాజ్యం, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడవకుదురులో..

చినగంజాం: మండలంలోని కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ జీ శివకుమారి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జీ శివకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కే రామారావు, జరీనా తాజ్, ప్రసాద్, శివయ్య, కవిత, హెలెన్‌రూత్, త్రిపురాంతకరావు, సంపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరసేవకులకు సత్కారం



కరసేవకులను సత్కరిస్తున్న గ్రామస్తులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో అయోధ్య రామమందిరం ప్రతిష్ట సందర్భంగా విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో రామమందిర నిర్మాణమే లక్ష్యంగా సాగిన నాటి కరసేవలో పాల్గొన్న కార్యకర్తలను మంగళవారం సత్కరించారు. 30 ఏళ్ల క్రితం అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తరలివెళ్లిన రిటైర్డ్ హిందీ పండిట్ బత్తుల కోటేశ్వరావు, రిటైర్డ్ హెచ్ఎం గన్నమనేని సుబ్బయ్యలను గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 శతాబ్దాల కల నేడు సాకారమైదని, 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు ప్రతిరూపమన్నారు. రాముడు జన్మించిన అయోధ్య కేవలం హిందువులకే కాకుండా బౌద్ధ, జైన మతాల ప్రజలు కూడా ఈ ప్రదేశాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. కార్యక్రమంలో అర్చకులు దీవి బావానాచార్యులు, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సామగ్రి అందజేత



కుక్కర్లు అందజేస్తున్న హీరో వీరరాజు

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమానికి రోషాగ్ని సినిమా హీరో రాజావీరరాజు మంగళవారం 10 లీటర్ల రైస్ కుక్కర్, ఇతర సామగ్రిని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.